# బంధాలూ - అనుబంధాలూ

తూర్పు కొండ మీంచి దాగ్రంత పొద్దు, ఆ వీధి వాకిట్లోకి యెర్రగా పరుచుకుంది. రెబ్బ కొండల మీంచి శీతగాలి యిళ్ళల్లోకి చల్లగా దాడి చేస్తోంది. పొట్టకుక్క వొకటి... యెవరో రాతితో కొడితే కుయ్యో మంటూ ఆ వీధి లోంచి పరుగుదీస్తోంది. చలి పులిని వెంటాడిన ఆ వీధి అప్పటికే పని పాటల్లో పడింది. పొలాలకు వెళ్ళిన మగవాళ్ళ కోసం వంట పూర్తి చేసి, చద్దన్నాలు తీసుకువెళ్ళే తొందర్లో ఆడవాళ్ళున్నారు. ఆ వీధి ఆ చివర శంఖం వూదుతూ, జంగం దేవర "బిక్షాం దేహి" అంటున్నాడు. చద్దన్నాల వేళ !

ఉమ చేతి సంచీ పట్టుకు బయల్దేరింది. ఇంటి ముంజూరు గడప దిగింది. చేతి సంచీని గడపలో పెట్టి, యిరుగూ పొరుగు వాళ్ళకు వెళ్ళొస్తా నని చెప్పటానికి నడిచింది.

ఆ వీధి యిళ్ళన్నీ ముంజూరు పెడకలు కలసిపోయి, వొకే వాస పూసినట్లుగా వుంటాయి. ఆ వీధి వాళ్ళంతా దగ్గర చుట్టాలే ఉమకు. గడప దిగి, రెండడుగులు యిరుగు వైపు నడిచిన ఉమ, మళ్ళీ వెనక్కి వచ్చి -

"... వొట్టి చేతుల్తోనే యెలిపోవాలన్న మాట? అయితే మరి యేటీ యివ్వవన్న మాట ?" అని అడిగింది, గడపలో కూర్చున్న అన్నపూర్ణమ్మను.

గడపలో అన్నపూర్ణమ్మ దిగాలుగా, అడవిపాలైన చంద్రమతిలా కూర్చుంది. ఒడిలో లోహితాస్యుడు యెండిన పాలిండ్ల మీదకు యెగబ్రాకు తున్నాడు. అన్నపూర్ణమ్మ దీర్ఘాలోచనలో వుంది. ఉమ మాటలు విన్పించుకుంది గానీ ఆమెకు జవాబు చెప్పకుండా, ఆలోచనల్లోనే వుండిపోయింది.

మూడు రోజుల క్రిందట వొచ్చింది ఉమ. తోటి కోడలు, చుట్టపు చూపుగా వొచ్చిందనుకున్నది అన్నపూర్ణమ్మ.

మౌనంగా వున్న అన్నపూర్ణమ్మను కోపంగా చూసి -

"... యేలిస్తారు? మీరేలిస్తారు? మేమెలాగ ఛస్తే మీకేటి బోయింది?" అని ముదలకించి, అలిగిన చిన్నపిల్లలా నేల మీద దబ, దబా అడుగులు గట్టిగా వేసుకుంటూ యిరుగింటికి వెళ్ళింది ఉమ.

".... వొస్తా నొదినే వొంట పనుల్లున్నావు గావాల, బస్సుకి టైమయిపోతంది. ఉండొస్తాను. అక్కడా టెలగుందో....? ఎలిపోవాలి. ఉండొస్తాను..." అని, యిరుగింటి ముంజూరు వద్ద నిలబడి కేకేసి, చెప్పింది ఉమ.

ఇరుగింటి వొదినె వంట పంచలోంచి బదులుకేక వేసి వస్తోంది. గానీ ఉమ ఆమె కోసం చూడకుండా, పొరుగింటి వైపు నడిచింది. మళ్ళీ అంతలోనే మరోసారి వెనక్కి, అన్నపూర్ణమ్మ దగ్గరకు వచ్చి-

"నీ నొచ్చేసరికే నీ గుండెల రాయిపడిపోయింది గావాల ఏటి, నీ ఆస్తిచ్చీమన్నానా ? అయిశ్వర్యమిచ్చీమన్నానా? అలాగ ముంగిపోతులాగ మూతి ముడుసుకుంతా వేమే ? ఉలకవూ, పలకవేమే ?" అని కయ్యానికి కాలు దువ్వింది.

అయినా అన్నపూర్ణమ్మ నోరు విప్పలేదు.పాలుచాలక, బిడ్డ పాలిండ్లను కొరికేడు. ఆలోచనలు తెగిసాయి. 'అమ్మా!' అంటూ బాధను మునిపళ్ళతో నొక్కుకుని, బిడ్డని మరో ప్రక్క స్తన్యానికి మార్చింది. ఇదేమీ గమనించని ఉమ కోపంగా కదిలి, పొరుగింటికి వెళ్ళింది.

"…. ఉండొలే, పిన్నమ్మా! ఎల్లొస్తాను, మూడ్రోజులుండిపోనాను, అక్కడ ఎలాగుందో…? ఉండొస్తాను ?" కేకేసింది పొరుగింటి పిన్నమ్మకు.

ఇరుగూ పొరుగామెలు వీధిలోకి వచ్చేరు వంట పంచల్లోంచి. బయల్దేరి పోయిన ఉమతో - "... యెలిపోతున్నావా ?" అని అడిగేరు.

"... ఎళిపోకపోతే, యిక్కడెవులున్నారు మాకు ? మూడు రోజులికే ముక్క లయిపోయింది చుట్టరికం. వొచ్చిన్నా డొండేరు… వొన్నమూ, కూరా అతరాత నుంచీ.. చోడంబలే పోసినారు. ఎప్పుడెళ్ళిపోద్దా అని చూస్తన్ను…" అంటూ అన్నపూర్ణమ్మ మీది కోపంతో, ఆ యింటి గుట్టు బయట పెట్టింది ఉమ.

"….యేటి జేస్తామమ్మీ? ఎవులింటిలా… అంతే. ఇంటింటా .. మంటిపొయ్యే! కరువుకి యెవులి కడుపు ఆళ్ళకే బరువయిపోతంది. సుట్టరికాలూ, మరియేదలూ మరింకేటి సూడగలం ?" అంటూ పొరుగింటి పిన్నమ్మ, అందరి పరిస్థితీ అంతే సుమా అని చెప్పింది.

అంతదాకా అంతరంగంలోనే మథన పడిన అన్నపూర్ణమ్మ అపుడు నోరు విప్పింది. తోటికోడలి దెప్పి పొడుపుకి జవాబిచ్చింది-

"….. మీ మేటి ఉజ్జోగస్థులంకాము. వొరన్నమూ, కూరలు వొండుకు తినడానికి. కూలాడితేనే కుండాడతాది మాకు. మీలాగ నెల తిరగీసరికి, నోట్ల కట్టలందవు మాకు. ఉన్ననాడు మీమూ యెట్టాం. మీరూ తిన్నారు. పంట భూములు పెల్లి పోయి, కూలి బతుకొచ్చింది. ఈ నాడు మీము చెడ్డోలిమైపోయేమా? ఇంతక ముందు చేసిన దంతా మర్చిపోతారా ? ఇదేనా తీరవ?" అంటూ నిష్ఠుర మాడింది అన్న పూర్ణమ్మ.

ఆమె నిష్ఠూరంలో సుదీర్ఘకాలం పాటు ఆ యింటి కోసం, ఆ కుటుంబం కోసం ఆమె జేసిన 'రెక్కలసాము' వ్యక్తమయ్యింది.

అన్నపూర్ణమ్మ మౌనంగా వున్నంత సేపూ కేక లేయగలిగింది గానీ, ఆమె నోరు విప్పేసరికి ఉమ జవాబు చెప్పలేక పోయింది. ఈ భయంతోనే మూడు రోజులుగా అడగాలనుకునీ, అడగలేక పోయింది ఉమ. గానీ వచ్చిందే అందుకోసం. అందుకే బయల్దేరాక ఆగలేక అడిగేసి తగువుకి దిగింది.

ఒకవైపు ఉమకు బాధగానే వుంది యిలా అడుగుతున్నందుకు. గానీ మరో వైపు అడగక తప్పని స్థితి. మనసులో ఆందోళనగా వుంది. అక్కడ యెలా వుందో…? ఏమైందో… ? ఉమ యిక్కడున్నదే గానీ మూడు రోజులు ముళ్ళ మీద నిల్చున్నట్లే వుంది. మనసులో ఆరాటమంతా అక్కడ స్థితి గురించే. అక్కడి వైపు ఆలోచనలు ముసిరినాయి ఉమలో……..

"… అప్పుడప్పుడిలాగ అయిందానికీ, కాని దానికీ మిల్లు మూసీడం రివాజయిపోయింది మేనేజిమెంటుకి…"

"ఏనుగు సచ్చినా, బతికినా యిలువేనట. అలాగ మిల్లు మూస్సినా లాభమే. నడిపినా లాభమే మేనేజిమెంటుకి. నడిపిస్తే ప్రొడక్షను యెక్కువ జేయించి లాభాలు తీస్తారు. మూసేస్తే వర్కర్ల జీతాలు యెగ్గొట్టి, మిగుల్చుకుంటారు…"

"మిల్లు మూస్సినోడు, మరి మిల్లులోని ప్రొడక్షన్‌ని అమ్ముకోవడమేటి? బంద్ అనీవోడు 'మరి అన్నీ బంద్ జెయ్యాలా ? ప్రొడక్షన్ అమ్ముకోవడమేటి ?"

".... అందుకనే ప్రొడక్షన్ యికనుండి రవాణా గాకీకండా అడ్డుకోవాలని యూనియన్ పిలుపిచ్చింది.'

"..... అలగయితేగానీ, మేనేజిమెంట్ దిగిరాదు..."

లాకవుట్ ప్రకటించిన జూట్‌మిల్లు యాజమాన్య వైఖర్ని కార్మికులు యెక్కడికక్కడ చర్చించుకుంటూ , నిరసించేరు. లాకవుట్ కాలంలో మిల్లులోని ఉత్పత్తిని రహస్యంగా రవాణా జేస్తుంటే, వర్కర్లు సంఘటితంగా అడ్డు నిలిచేరు.

దిగిరాలేదు మేనేజిమెంటు. దిగి వచ్చింది రక్షకభట దళం.

"శాంతి, భద్రతలకు భంగం కలిగించ గూడదు" అన్నారు రక్షకభటులు.

"లాకవుట్ ప్రకటించి మాకు ఆకలినీ అశాంతినీ మేనేజిమెంటే కలిగించింది." జవాబిచ్చేరు వర్కర్లు.

" .... ఉత్పత్తి మేనేజిమెంట్‌ది. దానిని వారు యెప్పుడైనా, యెక్కడికైనా రవాణా జేసుకునే హక్కు, అధికారం కలిగి వున్నారు. మీరిలా అడ్డుతగల గూడదు. హక్కులకు భంగం కలిగించొద్దు..."

"పని జేసే మా హక్కుని మేనేజిమెంటే భంగపర్చింది..."

" ఆ విషయం కోర్టులో తేల్చుకోండి, రోడ్డు మీద కాదు..."

" కోర్టువారు లాకవుట్ యెత్తేయమనీ, మిల్లు తెరువమనీ తీర్పిచ్చేరు. కానీ ఖాతరు జేయలేదు మేనేజిమెంట్...."

"...ప్రభుత్వానికి విన్నవించుకోండి..."

"ప్రభుత్వమంటే యెవరు? ఎక్కడుంది? ఏది ప్రభుత్వం???"

రక్షకభటదళం మరి ప్రశ్నల్ని రానీయలేదు. వచ్చిన ప్రశ్నలకు లాఠీల్తో జవాబులు యిచ్చారు.

ఆ లాఠీ దెబ్బల్ని మోసుకుంటూ వర్కర్లు ప్రభుత్వం కోసం వెదికారు. గాయాల్ని తడుముకుంటూ, ఆపద్బాంధవుల కోసం అన్వేషించారు.

పిల్లా జెల్లానీ, తమ కుటుంబాల్నీ గాక ఆ మిల్లుకి ముడి సరుకును పండించే రైతుల్నీ కూడగట్టి, ఆకలి కేకలు వేసారు వర్కర్లు.

"కార్మికుల తొలగింపు-రద్దుకావాలి"

"రిటైర్డ్ కార్మికుల గ్రాట్యూటీ బకాయి చెల్లించాలి"

"అక్రమ లాకవుట్‌ను వెంటనే యెత్తి వేయాలి"

"మిల్లును తెరిపించి కార్మికుల్ని ఆదుకోవాలి..."

అంటూ అరిచేరు. ఆక్రోశించేరు. ఖాళీ కంచాలు పట్టుకొని అధికార యంత్రాంగం దగ్గరకు ఆకలి యాత్రజేసారు, ధర్నాలు, గేటు బైఠాయింపులూ జేసారు.

పిల్లలు ఆకలికి యేడ్చేవాళ్ళు. భర్త కాల్తోన్న కొలిమిలా నినదించేవాడు. ఉమకు ఒక్కో దృశ్యమూ మనోఫలకం మీద కదిలి దుఃఖం పొంగుకొచ్చింది. గడపలో నిస్సత్తువగా కూర్చుండిపోయింది. ఇరుగూ పొరుగమ్మలు విస్తుపోతూ, ఉమ వైపు చూస్తున్నారు.

ఆరు నెలలుగా మిల్లు మూతబడి, ఆవరించిన దారిద్ర్యం యెంతటి క్షోభకు గురిజేసిందో, వీళ్ళకెలా చెప్పను ? అంతటి కటిక దారిద్ర్యంలో కావలసిన వాళ్ళు కాస్తయినా ఆదుకోరా? పైగా యేవో మాన్యాలు యిచ్చేసినట్టు మాట్లాడ్తారా ? కోపమూ, దుఃఖమూ కలగలిసిన రోషంతో -

"....ముస్టిముండ ఉజ్జోగం ముక్కలయిపోబట్టే నీగడప యెక్కినాను. లేకపోతే నీ గడపెక్కుతానా? నిన్ను పలకరిత్తానా? నీ ముక్కుమీద మసిఅంతానా ... దండంబెట్టేసి, ఊరొదిలేసి యెళిపోనాం గదా?" అని కయ్యిమాడింది ఉమ.

"...యేటట్రా ? తోటికోడళ్ళ లాగ యీదిల కయ్యాలాడుతారు? నలుగురూ నవ్వగల్రు..." అని కోప్పడింది పొరుగింటి పిన్నమ్మ.

"...లేకపోతే, దీని ఆస్తిచ్చి మన్నానా? నున్నగ గింజుకుంటంది..." ఫిర్యాదు జేసింది ఉమ.

"ఇచ్చిడంకి, నాకాడ వుండాలా?" అన్నపూర్ణమ్మ అంది.

" ఏటిలేవే? "

"....నువ్వడిగినవే..." అంది అన్నపూర్ణమ్మ .

ఇరుగూ పొరుగమ్మలకు యీ తగువేమిటో అర్థం కాలేదు.

"...ఇంతకీ నువ్వేటగిడినావే...? " ఆరాదీసారు వాళ్ళు.

చెప్పింది ఉమ. ఆశ్చర్యపోయేరు వాళ్ళు!

అప్పుడు అన్నపూర్ణమ్మ -

"సేరడు బియ్యపు గింజల్లేక సోడంబలి తాగతన్నాం. ఇంటిల్లపాదీ వొంటి పూట గెంజికే గింజుకుంటన్నాం. ఇరుగు పొరుగునున్నారు మీకూ తెలుసు. చెప్పండి. చూస్తున్నారు మీరూను. మీమేటి తింటన్నామో, యెలగ బతుకుతున్నమో. మీరెరగని నిధులు వుండి పోనాయేటో అని, మా తోటి కోడలకి అనుమానంగుంది. మీరేనా చెప్పండి దానికి." అంటూ వాళ్ళని తీర్పు చెప్పమంది.

ఉమ బాధతో నేలచూపులు చూస్తూ, గడపలో కూర్చుంది.

అంతలో అవతల వీధిలోంచి సావిత్రి "పెరటి తలుపులు తీసి, వీధిల కూర్చున్నారేటట్రా? కుక్క దూరిపోయింది వంట పంచల... " అంటూ, కుక్కను వెంట దగుల్తూ వొచ్చింది.

"దూరనీయి. తిరిగి, తిరిగీ అదే యెలిపోద్ది. ఇంటిలేటున్నాయి అది తినీడంకి? " బదులు చెప్పిందిఅన్నపూర్ణమ్మ .

అప్పుడే ఉమని చూస్తూ "ఇదేటి? నువ్వింకెళ్ళలేదా ఉమక్కా? అక్కడ గొప్ప గొడవలగుందాట? చింతాడ సీతాలక్ష్మి చెప్పింది. ఆళ్ళాయనా, మిల్లుల పన్జేస్తుండలే..." అని అడిగింది సావిత్రి.

"యే సీతాలస్మి? మా జనార్థన పెళ్ళమేనేటే ? ఎపుడొచ్చింది ? ఉన్నాదా, యెళిపోనాదా ? మా తమ్ముడి కూతురేనే అదీ ...." అంటూ సీతాలక్ష్మితో తన బాంధవ్యాన్ని తెల్పుతూ, అడిగింది పొరుగింటి పిన్నమ్మ.

"ఆఁఆఁ ... ఆవిడే, జనార్ధన పెళ్ళమే, రావడం, యెళిపోడం అన్నీ జరిగిపోనాయి. ఆరు మాసాల్నించీ జీతాల్లేవట. కొంచెం బియ్యం కోసం వొచ్చింది. వొచ్చింది, వొచ్చినంత తొందరగా బియ్యఁవొట్టుకొని నిన్న సాయంత్రమే యెళిపోయింది. మిల్లుకాడ రేపేదో గొడవ జరుగుతాదిట. యెళిపోవాల అని సెప్పి పారిపోయింది. నువ్వింకెళ్ళ లేదా, ఉమక్కా?" అని మళ్ళీ అడిగింది సావిత్రి.

ఉమ యేమీ బదులివ్వలేదు. దిగులుగా కూర్చుంది.

"ఇంతకీ ఆరుమాసాల నించీ జీతాలు లేకపోడమేటమ్మీ?" ఉమని ప్రశ్నించింది పొరుగింటి పిన్నమ్మ.

"మిల్లు మూస్సేరు..." గుండెల్లో గూడు కట్టిన దుఃఖం గొంతులోకి చేరి యేడుపు గొంతుతో చెప్పింది ఉమ.

"యేల మూస్సేరు?"

జూట్ మిల్లులకు సెప్టెంబర్ నుంచీ ఏప్రిల్ దాకా ఉత్పత్తి సీజన్, మేనెల నుంచి ఆగష్టు దాకా ఆన్‌సీజన్. ఈ అన్ సీజన్‌లో మిల్లు మూసేస్తే, పూర్తికాలం పని లేనందుకు వర్కర్లకు సర్వీస్ సెలవులు యివ్వనక్కర్లేదని, అలాగే లాకవుట్ కాలమంతా బోనస్ చెల్లింపు చేయనక్కర్లేదనీ, మరీ ముఖ్యంగా, విద్యుత్‌కోత జరిగే యీ మే నెలనుండి ఆగస్టు కాలంలో మిల్లు మూయకపోతే, కరెంట్ లేక పని నడవకపోయినా లే ఆఫ్ ప్రకారం వర్కర్లకు జీతాలు చెల్లించుకోవాల గనకా వీటన్నిటినీ యెగ్గొట్టడానికి యాజమాన్యం యీ లాకవుట్ అనే రక్షాకవచం తొడుక్కొని మిల్లును మూసేస్తుందంటారు కార్మికులు.

"వాళ్ళలాగే అంటారు, మోసేవాడికి తెలుస్తుంది కావడి బరువు అన్‌సీజన్‌లో గూడా జీతాలు పెంచమంటారు. బోనస్ లంటారు. అయినా అన్‌సీజన్‌లో పెట్టుబడులనవసరంగా యెవరండీ పెడతారు? మిల్లు పెట్టిందే లాభాల కోసం కానీ వర్కర్ల కోసం కాదుకదా? అన్‌సీజన్‌లో, అల్లర్లలో మిల్లుని ఎలా నడపగలం." అంటారు యాజమాన్యం వారు.

కార్మికుల వాదన, యాజమాన్యపు వాదనా రెండింటినీ విని అధికార యంత్రాంగం నిబంధనల గ్రంధాలలోకి తలలు దూర్చి, ఉష్ట్రపక్షిలా ఉంటుంది.

ఇదిగో యిలా పరిస్థితి చేజారినపుడు మాత్రం జీపులు ఆఫీసులు దాటి కదుల్తాయి. అధికారులు జీవోలను వల్లిస్తారు.

ఎంతకీ ఉమ నుండి సమాధానం రాకపోవడంతో, మళ్ళీ పొరుగింటి పిన్నమ్మే "మరా మిల్లుని నమ్ముకున్నోళ్ళని నట్టేటిల ముంచేస్తే అడిగినోళెవుల్లేరా? అయితే, మరి మీకు దారేటి లేదా?" అనడిగింది.

అప్పటికి ఉమకు గుండెల్లో దుఃఖం కెరటాలు వేస్తోంది. గొంతులోంచి మాటలు - మంచుగడ్డ కరిగి, నీటి బిందువులుగా పడ్తున్నట్లు... అసంకల్పితంగానే, అలా, అలా వొస్తోన్నాయి..........

"అన్ని దారులూ యెదుకుతున్నాం, దరకాస్తులెట్నాం, దండాలు పెట్నాం, కోర్టులు కెల్లినాం,కలక్టేరుని కల్సినాం, మంత్రి గోరికి మొక్కినాం, ఆకలి కడుపుల్ని అందరికి సూపినాం. ఇప్పుడికీ యెవులూ దారి సూపలేదు. అరువూ సరుపూ యిచ్చినోళ్ళు మరివ్వలేమనేసారు. ఒంటిమీది యెండీ బంగారప్పెసర లమ్మినాం, కొన్నాళ్ళు బత్తేలు జేసినాం. అవీ అయిపోయినాయి. పొయ్యిల్ల పిల్లులు తొంగొంటన్నాయి.అటు యూనియనోల్తోటి యూనియన్ పన్లమీద తిరగడం, యిటుయింట్లోకి బత్తెం గింజల కోసం తిరగడం తాళింపు దాకలోని కంది గింజలాగ... కమిలి పోతున్నాడు నా పెనిమిటి.

ఏనాడిలా యింటిల యిబ్బంది రానిచ్చినోడుగాదు. అలాటిది యిప్పుడు అతగానికీ అలివిగా లేదు. వారం రోజుల కాంచి, కడుపుల యేటి పోసు కుంతండో తెల్దు. బయట తినీసేను, మీరీ నూకల్తోటి జావ చేసుకు తాగండని, యిన్ని నూకలు సంపాదించి తెస్తండు.నాకు అనుమానం గుంది, నువ్వు తింటన్నావా? ఈ తిండి నాకొద్దు. ఈ బాధనేను భరించలేను. ఆ సావేదో ఆకల్తోటి అందరమూ సద్దుం. అని నేను యేడిస్తే పిల్లల్ని ఒడిలోకి, తీసుకొని అతగానూ యేడుస్తాడు. ఏటి సెయ్యిడం? ఎందలో బడి సావడం ? ఇదిగిదీ మా బతుకు...! కొండంత ఆశతోటి యిక్కడికొచ్చేను .'ఎంటనే యెలిపోరానా ' అని అతగానికి నచ్చ జెప్పి వొచ్చేను. మూడ్రోజులుండిపోనాను, వొట్టి సేతుల్తోటే యెల్తన్నాను. అక్కడాట యెలాగుందో...? ఉండండొస్తాను. మా రాత యెలాగుంతే అలగ జరక్కమాన్దు. ఎల్లొస్తానుండండి..." తన కడుపులోని దుఃఖాన్ని వెళ్ళగక్కి కన్నీళ్ళు తుడుచు కొని, లేచింది ఉమ.

అందరూ "అయ్యయ్యో..." అని నొచ్చుకున్నారు. సానుభూతిగా ఉమను చూడసాగేరు. అన్నపూర్ణమ్మకు కడుపులో పేగు కదలాడింది.

మరిది శివకృష్ణను యింతప్పట్నించీ పెంచింది. 'ఈ వర్షాధార భూముల్లో రైతు బతుకు బతకలేవు... చదువుకోమని చెప్పింది. చదివితే, యే నౌకరీ అన్నా దొరికితే.,. యీ మట్టి బతుకు నీకు తప్పుతుంది అని చెప్పింది. అలాగే చదివించింది. ఏ యిబ్బందీ మరదికి రాకుండా పెంచింది అన్నపూర్ణమ్మ.

శివక్రిష్ణ గూడా చదివినపుడూ, తర్వాత కాలంలోనా వొదినచాటు పిల్లడుగానే యెదిగాడు. ప్రతి చిన్న సమస్యనీ తనతో చెప్పేవాడు. అలాంటిది ఆరు నెలలు మిల్లు మూసేస్తే, ఆకలితో అలమటిస్తూ తనకు చెప్పకుండా గడిపేడు. తమ మధ్య యీదూరం యెప్పుడొచ్చింది ? ఎప్పుడు తన వొడిలోని బిడ్డ, లోకం వొడిలోకి జారేడు?

మరిది చదువూ, నౌకరీ, పెళ్ళీ... అన్నీ వరుసగా గుర్తుకొస్తున్నాయి అన్నపూర్ణమ్మకు ......

"జలగ అమ్మో, వదినా జలగ కాలిపిక్కని పట్టేసింది వొదినా... " మోస్తోన్న జనుముల కట్టని దభేల్న వొడ్డు మీద పడేసి, భయంతో కేకలేస్తూ గెంతుతున్నాడు శివకృష్ణ.

పడుకు చెరువులో ఊరబెట్టిన జనపమావులోంచి, కట్టలు తీసుకొచ్చి వొడ్డుమీద వొలుస్తోన్న ఆడవాళ్ళ ముందర వేస్తున్నాడు శివకృష్ణ . చెరువులో జలగ శివకృష్ణ కాలిపిక్కను పట్టేసింది. చెరువుల్లోకి దిగితే, మనుషుల్ని జలగలు పట్టడం మామూలే . ఆ మాత్రానికే అంతగా బెంబేలెత్తి పోతోన్న శివకృష్ణని చూసి, ఆడవాళ్ళు నవ్వుతూ ఎగతాళి చేయసాగేరు. అన్నపూర్ణమ్మ మాత్రం వొలుస్తోన్న జనపకర్రల్ని వొదిలేసి, గబగబా శివకృష్ణ దగ్గరకు వచ్చింది. శివకృష్ణని కదలకుండా నిల్చోమంది. కాలిపిక్కను పట్టిన జలగను యెడమ చేత్తో లాగింది. జలగ పట్టు వొదలటం లేదు. ఇలా లాభంలేదని, గబగబా వెళ్ళి చెరువు గట్టుమీద అడ్డాకుల గొడుగు క్రింద దాచిన భర్త చేతుల బనీను వెదికింది. బనీను జేబులోని పొగాకు చుట్టను తీసింది. చుట్ట రెమ్మలు విప్పి, రెండు రెమ్మల్ని తీసుకొని నోట్లో వేసుకొని బాగా నమిలింది పొగాకు రసం బాగా నోటిలో ఊరేక, ఆ రసాన్ని శివకృష్ణ కాలి పిక్క మీద ఉమ్మింది. పొగాకు రసం తగిలి, జలగ పట్టు సడలించింది. అప్పుడు అన్నపూర్ణమ్మ జలగను పట్టుకొని లాగేసి, దూరంగా తుప్పలలోకి విసిరేసింది.

"గొప్ప మొగోడివయ్యా ! జలగకి జడిసిపోయి, వొదిన్ని కేకేసినావు. రేపు పెళ్ళాం పట్టుకుంతే యిలాగే బెదిరిపోయి, వొదిన్ని పిలుస్తావు గావాల" అని, యిగటమాడింది తెలకలోళ్ళ కోడలు.

".... చదువుకున్న పిల్లడు గదా. చెర్లూ, గెడ్డలంట దిగడం యెరగడు. ఒద్దంటే వొచ్చేడు. ఒచ్చినోడు వొడ్డున గూకోకుండా సాయింజేస్తానని చెరువుల దిగేడు.ఎన్నడెరగనోడికి జలగంటే భయిమెయ్యిదా ?" అంటూ. మరిదికి వత్తాసుగా, అన్నపూర్ణమ్మజవాబు చెప్పింది.

చెరువులో జనపమావుమీద వున్న బలరామయ్య ఆత్రంగా ఒడ్డెక్కాడు. "ఏటయ్యిందీ?" అని భార్యని అడిగేడు. "నొప్పిలేదు గదా" అని తమ్ముడ్ని అడిగేడు. ఆ తర్వాత - "నువ్వు మరి సెరువుల దిగొద్దు.జనుపు లెయ్యేద్దులే. నీను యేస్తాను గానీ, మీ వొదినే, నువ్వు యింటి కెళ్ళి అంబళ్ళు తీసుకురండి" అని చెప్పాడు.

బలరామయ్య, తమ్ముడి మీద చూపే అభిమానానికి -

".... తమ్ముడు సెరువుల దిగితే తడిసి ముప్పందుమయి పోతాడనో, కష్టపడితే కందిపోతాడనో. అన్నకి బయ్యిం. అన్నా, వొదినలూ మరీ అపురూపం జేసీకండి పిల్లడ్ని...." అంటూ హాస్య మాడింది యడ్ల సరస.

అప్పటికే సిగ్గుతో కుంచించుకు పోతున్న శివకృష్ణ సరస మాటల్తో మరింత ముడుచుకు పోయేడు. మళ్ళీ అన్నపూర్ణమ్మ ఆదుకుంది -

"... యింత అపురూపం జేసీ, నీలాంటిదాని కొంగుకి అందించక తప్పదు గదా? పోనీ, ఆ అపురూపమేదో నువ్వే సెయ్యిరాదా? మీ మొద్దన్నామా ? మాకూ శ్రమ తప్పుతాది" అని తిరిగి దెబ్బ గొట్టింది సరసకు అన్నపూర్ణమ్మ.

ఆ మాటల్తో యడ్ల సరస సిగ్గుపడి తల దించుకొని, జనపకర్రలు వొలుచుకోసాగింది. ఆమెను చూస్తూ, తెలకలోళ్ళ కోడలు

- " ...... ఈ కాలం పిల్లలు అందరూ సూసినట్టుగా అపురూపాలు సేస్తారేటి ? ఎవులూ లేని టయిముల - నీలాటి రేవు తోవలో జాబు మామిడి తోటలో చేస్తారు గానీ ... !" అంది, యడ్ల సరసను ఆట పట్టిస్తూ.

ఆ మాటలకు ఆడవాళ్ళంతా గొల్లున నవ్వేరు, అప్పటికి శివకృష్ణ తేరుకొని, చిన్నగా నవ్వేడు. సరస మాత్రం కోపం నటిస్తూ, వొలుస్తోన్న జనపకర్రని తెలకలోళ్ళ కోడలు మీదకి విసిరి ".. మాలా టోళ్ళం ఆ పిల్లడికి ఆన్తామా? సూస్తాడా ? చదువుకున్నోడు గదా? రొండు జెడలోళ్ళూ, నైలాన్ లంగా, వోణీ వోళ్ళూ ఆన్తారుగానీ..." అని శివకృష్ణనే మళ్ళీ దెబ్బ గొట్టింది.

ఆ మాటలకు తెలకలోల్ల కోడలు అందుకొని "... వొకేల, యీ పిల్లడు చూసినా, ఆ అన్న చూడనివ్వడు, ఈ పిల్లడ్ని అయిక్లాసు (హైక్లాస్) మనిసిని జెయ్యాలని, అన్న తాపత్రయం..." అని కారణాన్ని చెప్పింది.

నిజమే, తమ్ముడ్ని బాగుజెయ్యాలన్నదే బలరామయ్య తాపత్రయం. ఒక మిద్దె యింటినీ, జోడెద్దుల్నీ, రెండెకరాల పల్లపు భూమినీ, ఎకరా మెట్టనీ వొదిలేసి వెళ్ళిపోయేరు, తల్లిదండ్రులు. తోబుట్టువులుగా, ఒక చెల్లెలునీ, ఒక తమ్ముడినీ అందిచ్చేరు.

పద్దెనిమిదేళ్ళ వయసులో యీ బరువుబాధ్యతల్నీ, భూమీ,పుట్టనీ అందుకున్నాడు బలరామయ్య . తోబుట్టువులకు తల్లిదండ్రుల స్థానంలో బలరామయ్య నిలబడ్డాడు. నేల బుగ్గి నెత్తి నెత్తుకున్నాడు. ఏటికి యెదురీద సాగేడు. ఆ విషయం తెలిసిన తెలకలోళ్ళ కోడలు, అందుకనే అలా అన్నది.

అందుకు జవాబుగా సరస - "... ఆ అన్న సూడనిచ్చునో, లేదో... మా అన్నపూర్ణప్పకి తోడబుట్టినాను గాదు తేల్చిద్దును..." అంది.

"తోడబుడితే, యేటి తేల్చిద్దువే? మీ అప్పకి తోక పెళ్ళికూతురువై కూకుందువు. అంతగా గీర్మానం జేస్తే నాసేత మారు తాళి కట్టించుకుందువు. అంతేగానీ, మాతమ్మిడి సేత మాత్రం కట్టించుకోలేవు..." అని బలరామయ్య కుండ బద్దలు గొట్టినట్లుగా సరసకు జవాబు చెప్పి చెరువులోకి దిగేడు.

అన్నపూర్ణమ్మ నవ్వుతూ, శివకృష్ణను తీసుకొని యింటికి నడిచింది. దారిలో శివకృష్ణ ".... వొదినే నీకు చుట్ట అలవాటు లేదు గదా, మరి పొగాకు రెమ్మ యెలాగ నమిలేవు? చేదు అన్పించలేదా?" అని ఆశ్చర్యంతో అడిగేడు.

"... మరిది కోసం ఆ మాత్రం యిషం మింగప్పోతే యెలాగ?" అని నవ్వేసింది అన్నపూర్ణమ్మ

అంతకంటే యెక్కువ చేదువిషాన్నే ఆమె చేత మింగించింది జీవితం!

కళ్ళల్లో నీళ్ళు కదలాడినయి, మనసులో కదలాడిన స్మృతుల్ని దిగమింగుకుంది అన్నపూర్ణమ్మ. ఉమ వైపు సానుభూతి నిండిన కళ్ళతో చూసింది.

ఉమని వొట్టి చేతుల్తో పంపగూడదు. ఈ వొక్కరోజు ఆగమని చెప్పాలనుకుంది. ఎక్కడో వొక దగ్గర సంపాదించమని భర్తకి చెప్పాలి. మళ్ళీ అంతలోనే యెక్కడ సంపాదించగలడు? చేరడు నూకలకే చేట బట్టుకుని గడప, గడపా ఎక్కి దిగుతున్నామే? వాస్తవం గుర్తుకొచ్చి యేం చేయాలో పాలు బోవడం లేదు అన్నపూర్ణమ్మకు.

ఉమ చేతి సంచీ తీసుకొని బయల్దేరి పోయింది. అన్నపూర్ణమ్మ మౌనంగా చూస్తూ వుండి పోయింది.

అప్పుడొచ్చేడు బలరామయ్య భుజమ్మీద బియ్యపు మూటతో !

బియ్యపు మూటను చూసి, ఉమ అక్షయ పాత్రను చూసిన బిచ్చగత్తెలా పొంగిపోయింది.

".... వొట్టిపోయిన గోవుల్లాగ అన్నీ పోయి, యీ కరువుకి మిగిలినాం గానీ, మీరు పస్తులుంటే మీము సూసి, పల్లకుంతామా తల్లీ? పద, పదా బియ్యమ్మూటని బస్సు కెక్కించేస్తాను, రా..." అని మరదల్ని బయల్దేరమన్నాడు బలరామయ్య.

అన్నపూర్ణమ్మ ఆశ్చర్యంగా భర్తనే చూస్తోంది. ఆమెకి భర్త - కవచకుండలాలు వొలిచి యిచ్చిన కర్ణుడిలా కన్పించేడు.

చిన్ననాటి నుంచీ యెరిగున్న మనిషి. స్వయానా మేనత్త కొడుకు. తన తండ్రి చెల్లిలి కొడుకు. అన్నపూర్ణమ్మ పుట్టినపుడే బలరామయ్యకు పెళ్ళం పుట్టిందన్నారందరూ. రెండు కుంటుంబాలూ ఒకే ఊరిలో వుండటం మూలాన ఆ యింటికీ, యీ యింటికీ రాక పోకలూ యెక్కువ గానే వుండేవి.

తల్లీ దండ్రీ పోయేక, తోబుట్టువుల్తో బలరామయ్య సతమతమవుతుంటే అన్నపూర్ణే ఆదుకుని, ఇంటి పనీ, వంటపనీ చేసేది. మరిదినీ, ఆడపడుచునీ పని ముట్టనిచ్చేది కాదు.

"... ఈడు దీరిన పిల్ల గదా ? పైగా మేనరికమూ, మరింకేల ఆలిస్సెం? ఆ ముచ్చటేదో తొందరగా జరిపించీరాదా?" అని ఊరిలోవారు బలరామయ్యని సతాయించేవారు.

"ముందు చెల్లిల పెళ్ళీ, తమ్ముడి చదువూ అవ్వాల" అనేవాడు బలరామయ్య స్థిరంగా.

ఏకదీక్షతో అహర్నిశలూ పొలం మీద గొడ్డులా పని జేసాడు. రుతువుల్ని బతుకు పొలంలోకి ఆహ్వానించేవాడు. తోబుట్టువులు యెదిగొచ్చి ఖర్చులు పెరిగినట్టుగా, వ్యవసాయం మాత్రం పెరగలేదు. అందులోకీ, వర్షాధార భూములవటంతో, బలరామయ్యకి వ్యవసాయం ఋతువుల్తో జూదం ఆడినట్లుండేది.

పంటల్లోనూ మార్పులొచ్చేయి. మార్కెట్ కోసం పంటలొచ్చేయి. ఆ ముఠా అంతటా జనపనార పండించేరు. బెంగాల్ మార్వాడీలు బాగుపడ్డారు. వేరుశనగ పండించేరు. వ్యాపార్లు సొమ్ము జేసుకున్నారు. చెరుకు పండించేరు. రైతులు పిప్పి అయిపోయేరు. ఇహ ఇలాక్కాదని వరి పండించితే - పురుగు సోకి, పొల్లు పండితే కళ్ళంలో పొల్లు గింజల్ని గాలి కెగరబోసి, కళ్లు తుడుచుకున్నారు రైతులు!

అందరితోపాటూ బలరామయ్య పంటల్ని మార్చి, మార్చీ, మార్కెట్ వెంట పరుగెత్తి, పరుగెత్తీ అలిసిపోయేడు.

"... కష్టపడీ వోడికి రోజులుకావివి. కష్టాన్ని కొల్లగొట్టినోడివి యీ రోజులు. మట్టిని పిసికినోళ్ళము... మన నోటిల మట్టి గొడుతున్నోళ్ళని కానుకోలేక పోతన్నాము. ఎన్ను గింజల మీదకి ఎన్నెన్ని పిట్టలు వోల్తాయో, అన్నన్ని ఉరులు రైతోడి మెడ సుట్టూ బిగుసుకున్నాయి. పేదరాశి పెద్దమ్మ కధలోని ఒక మహా సాధ్వికి శాపముండిదట ! ఆ మహాసాధ్వి... చెట్టుకి వున్న ఫలాలను,వొడినిండా తెంపుకు మూటగట్టుకొనీదట . గానీ యింటికొచ్చీ చూసుకుంటే, ఒడిలో ఒకటే ఫలం మిగిలేదట. రైతోడికి శాపవిముక్తి గావాల నాయినా అని అనేవాడు అన్నపూర్ణమ్మ తండ్రి.

బలరామయ్యకు మామయ్య మాటలు అర్ధమయ్యేవికావు. కూతురిపెళ్ళి ఆలస్యమవుతున్నందుకు వ్యధపడుతూ అలా మాట్లాడ్తున్నాడేమో మామయ్య అని అనుకునేవాడు బలరామయ్య.

తన పెళ్లిని వాయిదా వేస్తూ, చెల్లెలి పెళ్ళికోసం సంబంధాలు వెదికాడు బలరామయ్య. నెల్లిమర్ల సంబంధం... వచ్చింది. దూరపు సంబంధమయినా, కుటుంబం మంచిది. కట్న కానుకలు ఎక్కువే యివ్వాల్సొచ్చినా జంకలేదు బలరామయ్య. అరయెకరా పల్లపుభూమిని అమ్మేసి, చెల్లి పెళ్లి జరిపించేడు.

చెల్లి అత్తారింటికి వెళ్లిపోయింది. తమ్ముడు చదువుకోసం పట్నం వెళ్లిపోయేడు. ఒంటరిగా మిగిలేడు బలరామయ్య. ఇహ అప్పుడు మామయ్య వొప్పుకోలేదు.

"...మీ యిద్దరి తలల మీద యిన్ని అక్షింతలు వేసే అదృష్టం లేకండా నా చెల్లెలు కన్ను మూసింది. నాకయినా, మీ పెళ్లి కళ్ళారా చూసే అదృష్టం లేదా?" అనడిగేడు. దగ్గరి బంధువులచేత చెప్పించేడు. చివరికి బలరామయ్య మెత్తబడక తప్పింది గాదు. అన్నపూర్ణమ్మ మెడలో తాళి గట్టేడు. కళ్ళారా వివాహం చూడకుండానే అన్నపూర్ణమ్మ తండ్రిని పోలీసులు తీసుకుపోయేరు.

అప్పటికి గానీ మామయ్య అర్థం కాలేదు బలరామయ్యకు. రాత్రుళ్ళు నక్సలైట్లకు తన కళ్ళంలో ఆశ్రయం యిస్తున్నాడన్న ఆరోపణపై అత్యవసర పరిస్థితి కాలమంతా అన్నపూర్ణమ్మ తండ్రిని జైల్లోనే వుంచారు. ఆ కాలంలోనే బలరామయ్యకు గల ఎకరా మెట్టభూమికీ సర్వే నెంబరూ, పట్టా నెంబరూ లేవనీ, అది ప్రభుత్వ బంజరు భూమి అనీ, అందువల్ల ఆభూమిని విడిచిపెట్టమనీ రెవెన్యూ అధికారులు నోటీసిచ్చేరు. కాదు బాబూ అనంటే, కన్నెర్ర జేసారు. అదేంవిటయ్యా అనంటే అరెస్టు చేస్తాం అన్నారు. బలరామయ్యకు అప్పుడు మామయ్య మాటలు గుర్తొచ్చాయి.

మిగిలిన ఎకరన్నర నేలమీదా తాము పడిన కష్టమూ, మరిది చదువుకి చేసిన అప్పులూ... అలా వొక్కక్కటీ జ్ఞప్తికి రాగా ... భర్త వైపు చూస్తూ, దీర్ఘనిశ్వాసం విడిచింది అన్నపూర్ణమ్మ .

ఉమకు గుండె బరువు దించినట్టయింది. అక్కవైపుకృతజ్ఞతతో చూసింది. అదేమీ పట్టనట్టు అన్నపూర్ణమ్మ బిడ్డను చంక నెత్తుకొని, గడపదిగింది. ఉమను సాగనంపడానికి. కొంగునముడేసివున్న అయిదురూపాయల నోటును ఉమ చేతిలో పెట్టింది. ఒద్దు ఉన్నాయిలే అంది ఉమ, అన్నపూర్ణమ్మ బలవంతాన ఉమ చేతిలో కుక్కింది నోటుని. అన్నపూర్ణమ్మ చంకలోబిడ్డ, ఉమవైపు చేతులు ఆడిస్తూ బోసినవ్వు నవ్వేడు. ఉమ, వాడిని అందుకొని ముద్దాడి, అయిదు రూపాయల నోటుని వాడిచేతిలో పెట్టింది. వాడు అనోటుని నోట్లో పెట్టుకోడానికి విఫలయత్నం చేయసాగేడు.

".... వొస్తానక్కా. అన్నట్టూ, వొచ్చే ఆదివోరం రాగూడదూ ? ఒంటిల బాగులేదంటన్నావు గదా ? అక్కడ డాక్టేరుకి చూపిద్దుము... " అంది ఉమ.

అన్నపూర్ణమ్మ వొస్తాననిగానీ, రాననీ గానీ అన్లేదు. నిర్వేదంగా ఉమని చూస్తూవుండిపోయింది . బలరామయ్య బియ్యం మూటతో బస్టాండ్‌కి దారి తీసేడు. ఉమ అతని వెనకాల కదిలింది. నిద్రపోతున్న బిడ్డని ముంజూరుకి కట్టిన కోకగుడ్డ ఉయ్యాలలో వేసి, ఊప సాగింది అన్నపూర్ణమ్మ .

ఆమె మనసులో గతం మరోసారి కదలాడింది.

మిగిలిన యెకరన్నర భూమిమీద వచ్చే ఫలసాయంతోటే తన సంసారం ఖర్చులతోపాటు, శివక్రిష్ణ ట్రెనింగ్ ఖర్చూ చూసుకోవాలి. ఎంతగింజుకున్నా అప్పుజెయ్యక తప్పిందిగాదు బలరామయ్యకు. ఆ అప్పు శివక్రిష్ణ నౌకరీలో చేరేక, తీర్చేయలేమా అని తనకు తానే సమాధానపర్చుకున్నాడు.

శివక్రిష్ణకి నౌకరీ అంతతొందరగా దొరకలేదు. రెండేళ్ళపాటు దరకాస్తుల ఆలిచిప్పని చేతబట్టి, స్వాతి చినుకుకోసం యెదురుచూసాడు. తమ్ముని దరఖాస్తులకీ దారి ఖర్చులకీ, యింటర్వ్యూలకీ మరి కొంత పెరిగింది అప్పు.

ఆ రోజుల్లోనే,నెల్లిమర్లలో వుంటున్న చెల్లెలు ఉమసంబంధం గూర్చి చెప్పింది బలరామయ్యకు. ఉమనాన్నగారికీ, ఆ ఏరియా ఎమ్మేల్యే రాజుగారికీ మంచిదోస్తీ వుందనీ, ఉమని పెళ్ళిజేసుకొంటే శివక్రిష్ణకి ఆ ఎమ్మెల్యే ద్వారా జూట్ మిల్లులో నౌకరీ యిప్పిస్తారనీ చెప్పింది.

కాదనడానికేముంది ? అలా జరిగిపోయింది ఉమతో శివక్రిష్ణ పెళ్ళి .జూట్‌మిల్లులో ఉద్యోగమూ వచ్చింది శివక్రిష్ణకు. కాకపోతే టెంపరరీ ఉద్యోగం. శివక్రిష్ణకి వచ్చే జీతం, తన యింటి ఖర్చులకే చాలేది కాదు. చేసిన అప్పులు బలరామయ్యకు పీకకు చుట్టిన బండలుగానే మిగిలేయి. రెండేళ్ళపాటు యిలా, యెవరికి వారు సంసారాలు యెత్తుకొని, బ్రతుకులీడ్చారు. కడుపు కట్టుకొని బలరామయ్యే వడ్డీ చెల్లించేవాడు. అసలు మాత్రం వశమయ్యేదిగాదు తీర్చడానికి .

.... ఓ రోజున పొద్దు బారెడు పొడిచింది. తూర్పున నేల పొత్తిళ్ళలోంచి ఆరుద్ర పురుగు మిస మిసా మెరుస్తూ నాగేటి చాళ్ళ మీద గర్వంగా తిరుగుతోంది. పక్షులు చేనుమీద ఎన్నుగింజల్ని పొడిచి, పలకరిస్తున్నాయి. తూరీగలు గట్టుమీద గరిక దుబ్బులకు అంటిన మంచుతో రెక్కల్ని తడుపు కుంటున్నాయి. ఆ చద్దన్నాల వేళ...

బలరామయ్య పొలం గట్టు మీదకూర్చొని చద్దన్నం తింటున్నాడు. అన్నపూర్ణమ్మ యెదురుగా కూర్చుంది. అప్పుడొచ్చాడు శివక్రిష్ణ!

మిల్లులో, పర్మనెంట్ వర్కర్ పోస్టుల సెలక్షనుంది అని చెప్పాడు అన్నయ్యతో. ఎమ్మెల్యే గారి, పి.ఏ.హామీ యిచ్చేడన్నాడు. పోస్ట్ ధర చెప్పాడుట పి.ఏ. అదెంతో చెప్పాడు శివక్రిష్ణ అన్నయ్యకి.

శివక్రిష్ణ ఎందుకు అలా చెప్తున్నాడో అర్థం కాని అన్నపూర్ణమ్మ , బలరామయ్య... వింటూ ఊ కొడుతున్నారు.

తీరా అర్థమయ్యేటట్లు శివక్రిష్ణ చెప్పేసరికి తింటోన్న బలరామయ్య అన్నం పొలబారేడు. ఓ క్షణం తర్వాత, "....యిది నీకు పుట్టిన బుద్ధా? లేక మీ ఆవిడకీ, అత్తోరికీ పుట్టిందా ? " అని అడిగింది పరుషంగా అన్నపూర్ణ.

శివక్రిష్ణ తలదించుకొని "అవసరం అలాటిది ! టెంపరరీగా, చాలీ చాలని జీతంతో బతకలేక పోతన్నాం. అదీగాక యెపుడు తీసేస్తారో చెప్పలేము టెంపరరీ గదా ? ఈ రోజుల్లో మరి ఆ మాత్రం యిచ్చుకోకుండా ... ఉద్యోగాలు రావు గదా?" నీళ్ళు నములుతూ చెప్పాడు.

"అయితే,ఆ లంచాలు యేవో,మీ అత్తోర్నే యిమ్మన లేక పోయేవా " అన్నపూర్ణమ్మ కు ఉక్రోషంగా వుంది మనసులో.ఇదంతా శివక్రిష్ణ అత్తమామల పన్నాగమే అని ఆమె నిశ్చయించుకుంది.

"వాళ్ళెందుకిస్తారొదినా ? అయినా వాళ్ళదగ్గర ఉండాలా డబ్బు యివ్వడానికి ?" బదులు చెప్పాడు శివక్రిష్ణ.

"మరి మా దగ్గిరుందేటి ? నీకు తెల్దేటి ? నీకు నౌకరి దొరక్క ముందు చేసిన అప్పులు అలాగేవుండి పోనాయి గాదేటి ? " అని గుర్తు జేసింది అన్నపూర్ణమ్మ .

శివక్రిష్ణ ఓ క్షణం మాట్లాడలేక పోయేడు. ఆ తర్వాత మాటలను కూడ బలుక్కొని -

" ఇంతకు ముందోదారి, యిపుడోదారీ. భార్యా పిల్లల్తోటి, తుమ్మితే పూడిపోయే ముక్కు లాంటి ఉద్యోగంమీద ఆధారపడలేను. మీకు సాధ్యంగాకపోతే, పోనీ నాకు వాటాకింద రావలసిన భూమి యిచ్చేయండి. దాన్ని అమ్మేసుకుంటాను..." అని, అసలు విషయం చెప్పాడు శివక్రిష్ణ ,భార్య చెప్పమన్న ఆఖరి మాట అదే.

ఆ మాట బలరామయ్య గుండెల్ని పొడిచింది. భూముల్ని వాటాలు వెయ్యడం, బంధుత్వాన్ని వాటాలు వెయ్యడం, బాధ్యతల్ని వాటాలు వెయ్యడం, బంధాల్ని విడదీసుకోడం, డబ్బుత్రాసులో తూచుకోడం...? బలరామయ్య చద్దన్నం తింటున్న గిన్నె లోనే చేతులు కడిగేసుకున్నాడు. మౌనంగా లేచి, గట్టు మీద పొలం యీకొసనుంచి, ఆ కొసదాకా నడిచేడు. కనుల నీరు నిండింది.

కాళ్ళకు తడి అంటకుండా ప్రపంచ యాత్ర చెయ్యొచ్చుగానీ, కళ్ళకు తడి అంటకుండా యే మనిషీ జీవనయాత్ర చేయలేడు అన్నాడో కవి.కన్నీరు తుడుచుకున్నాడు బలరామయ్య. తమ్ముడి దగ్గర కొచ్చి -

"…. మన మద్దెన పంపకాలూ, వోటాలూ అన్నమాటలొద్దు, పదా, సావుకారి దగ్గర కెల్దాము. డబ్బు అడుగుదాం" అని స్థిరమైన కంఠస్వరంతో చెప్పి రమ్మన్నాడు బలరామయ్య.

గతంలో చేసిన అప్పూ, యిప్పుడడిగిన అప్పుతో కలిపి నోటు రాయించి, హామి క్రింద ఎకరన్నర పల్లపు భూమినీ తనఖాగా తీసుకున్నాడు షావుకారి.

రైతుకూలీ అయినాడు బలరామయ్య. మిల్లు వర్కర్‌గా పర్మనెంట్ అయినాడు శివక్రిష్ణ!

కాలచక్రం ఆరేళ్ళు తిరిగింది. పిల్లల తండ్రులైన అన్నదమ్ములు, ఎవరి సంసారాలు వాళ్ళు యెత్తుకోలేక యాతన పడిపోయేరు. ఇద్దరి మధ్యా రాకపోకలు తగ్గిపోయాయి. పండుగలకూ, పబ్బాలకూ కలుసుకోవడం జరగడం లేదు, ప్రేగులు తెగిన ప్రాణుల్లా మిగిలేరు అన్నదమ్ములు.

…. ఇన్నేళ్ళ తర్వాత యిదేరావటం- బావగారి ఇంటికి ఉమ!

అన్నపూర్ణమ్మ మరిక... ఆలోచించ లేక పోయింది. ఊయల్లో బాబు నిద్ర పోయాడు. నిస్సత్తువగా అలా గడపలో గోడకు చేరబడింది.

బలరామయ్య బస్‌స్టాండ్ నుంచి తిరిగొచ్చాడు యింటికి.

భార్య ప్రక్కనే చతికిలబడి, జేబులోంచి పదిరూపాయల నోట్ల కట్ట బయటకు తీసి, అన్నపూర్ణమ్మకు యిచ్చాడు -

"....ఎలాగూ, ఆ భూమిని తనఖాయిడిపించటం మరి మన తరంగాదు. అందుకనీ యేకంగా అమ్మకానికి వొప్పుకున్నాను. వోరం రోజుల్లో తమ్ముడ్ని తీసుకొచ్చి, రిజిస్ట్రీ జేయించేస్తే మిగిలిన డబ్బు యిచ్చేస్తారు. అప్పుడు... అప్పుడు... మనమూ అక్కడికే యెళిపోదాం. భూమిలేని బతుకు... యిక్కడ బతకలేను. అక్కడ, మిల్లుల కళాసీ పనేనా దొరకదా?" గుండెల్లో బాధని అణచి పెట్టుకుంటూ చెప్పాడు బలరామయ్య.

అన్నపూర్ణమ్మగారు గుండెలు దడ, దడా కొట్టుకోసాగేయి. భూమిని అమ్మేస్తారా? భూమినే తల్లిగా నమ్ముకున్న తన భర్త భూమిని అమ్మేస్తాడా?' ఆశ్చర్యంగా చూసింది బలరామయ్యని. అతను శూన్యంలోకి చూస్తున్నాడు భావరహితంగా. అన్నపూర్ణమ్మకు అర్థమవుతోంది అంతరంగంలో భర్త పడ్తోన్న ఆవేదన ఓదార్పుగా, దగ్గరకు జరిగింది.

"పూర్ణా యిప్పుడిదాక నీను రైతుని. భూమ్మీద సాము జేసినోడ్ని. భూమి తనఖా బెట్టినా భూమి గల రైతోడినే గాని, మరిక నాకు ... సెంటు భూమి వుండదు. నీను రైతోడ్ని గాను. ఇక, నా పేరేం పేరు? భూమిని నమ్ముకు బతికే నాకు భూమి అమ్మకతప్పని స్థితి ఎందుకు ఒచ్చింది? ఎందుకు?" అడిగాడు.

అన్నపూర్ణమ్మ యేం జవాబు చెప్పగలదు - ఆర్తిగా భర్త వేపు చూడ్డంతప్ప!

అప్పటికి ఎండ నడినెత్తిమీద కొచ్చింది. గాలి కాస్త వేడెక్కింది. పంచాయితీ వారి రేడియో,పెద్ద గొంతుతో వార్తల్ని విన్పిస్తోంది-

".... జూట్ మిల్లు తెరిపించమని కోరుతూ, కార్మికులు రైల్ రోకో నిర్వహించారు. తమపై రాళ్ళు రువ్వేరన్న కారణంతో పోలీసులు కాల్పులు జరపగా శివక్రిష్ణ, రాజా, రంగయ్యా, మరో యిద్దరూ మొత్తం అయిదుగురు కార్మికులు చనిపోయారు" వార్తల్ని విన్పించింది ఆకాశవాణి.

పిడుగుపాటు శబ్దాన్ని విన్నట్లుగా త్రుళ్ళిపడ్డారు బలరామయ్య, అన్నపూర్ణమ్మలు

వార్తలు ముగించే ముందు, శివక్రిష్ణ మరణ వార్తనుమరోసారి ధృవపర్చింది ఆకాశవాణి!

బలరామయ్యకు, రక్త నాళాలన్నీ పటా, పటా తెగిపోయి, తన కళ్ళముందే, మంటల్లో కాలిపోతున్నట్లనిపించింది. అన్నపూర్ణమ్మ అచేతనమై పోయింది. రెబ్బ కొండల్లోంచి విసురుగా గాలి కొట్టింది. ఆ గాలికి, గడప మీద పడేసిన పది రూపాయల నోట్ల కట్టలోని నోట్లు రెప, రెపలాడ్తూ, పాము నాలుకల్లా కదుల్తున్నాయి.

బలరామయ్య కళ్ళ నిండుగా నీరు, గొంతులో దుఃఖం ....గుండెల్లో ఆక్రోశం...!

చటుక్కున నోట్ల కట్టను అందుకొని బలంగా విసిరేశాడు వీధిలోకి. ఆ తర్వాత, యేడ్పు గొంతుతో అరిచేడు గట్టిగా -

".... ఎవురిస్తార్రా...? ఎవురిస్తారు? నాకు, నాతల్లి భూదేవి కావాలర్రా. నాకు, నాకు .... నా తమ్ముడు కావాలర్రా...."

ఆ ఆర్తనాదం .... ఆ వీధిలోంచి, ఊరు ఊరంతా ప్రతిధ్వనించింది.

*(ప్రజా సాహితి డిసెంబరు 1995)*

❖ ❖ ❖